అతడు చెప్పాడు. "నాన్నగారు చిన్నప్పుడే పోయారు. అమ్మకి నేనంటే వల్లమాలిన ప్రేమ. దాంతో ఆడింది ఆట. పాడింది పాట. ఈ నాటకాల పిచ్చి వుంది. చూశారూ! ఇది ఆడపిల్ల ప్రేమలాటిది. దూరంగా వున్నంత సేపూ కవ్విస్తూంది. అడుగు లోపలికి పెట్టామా-- రంగస్థలానికి తాళికట్టేవరకూ వదిలి పెట్టదు."

ప్రవల్లిక నవ్వింది.

కారు ట్రాఫిక్‌లోకి వచ్చింది. అటూ ఇటూ కార్లు వేగంగా వెళుతున్నాయి. హారన్ శబ్దాలు చెవులు గింగిర్లెత్తిస్తున్నాయి.

ఆమె నవ్వుతూనే అంది-" మీ హాబీ ఆడపిల్ల ప్రేమలాటిదయితే మా ఉద్యోగం మగవాడి ప్రేమలాటిది. దూరంగా వున్నంత సేపూ టెంప్ట్ చేస్తుంది. లోపలికి వెళ్ళాక ఎపుడు బయటకు పారిపోదామా అనిపిస్తుంది."

"ఇంత చిన్న వయసులోనే అంత పెద్ద ఉద్యోగం చేస్తూ అలా అంటారేమిటి? మీకీ ఉద్యోగం ఇష్టంలేదా?"

"లేదు. ఏమాత్రం లేదు. నాకయితే ఏదైనా పదెకరాల పొలం మధ్యలో మంచె వేసుకుని నాలుగు కోళ్ళు, పది మేకలు పెంచుకోవటం ఇష్టం."

"ఇంకా నయం మీక్కాబోయే ఆయన ..... "

పక్కనుంచి వెళ్తూన్న కారు హారన్ శబ్దంలో అతడి మాటలు పూర్తిగా వినపడలేదు.

"ఏమన్నారూ?"

"మీ కల్నల్‌గారు ..... "

మరో కారు హారన్.

"మైగాడ్. ఈ కారు హారన్‌ల గొడవకి చెవి పక్కగా చెప్పింది కూడా వినపడటం లేదు ..."

అతడి మాట పూర్తి అవలేదు - ఆమె కారుని సర్రున పక్కకు తీసి ఆపింది. అతడామె వంక 'ఎందుకు' అన్నట్టు విస్మయంగా చూశాడు.

ఆమె సాలోచనగా- "వాళ్ళు మాట్లాడుతూ వుంటే విమాన శబ్దం వినిపించింది. చాలా దగ్గిరగా, చెవి పక్కగా వెళుతున్నట్టు ..... " అంది. ఒక దుర్భేద్యమైన కోటలో ప్రవేశించటానికి గాలి చొరవడేంత సందు దొరికిన ఫీలింగ్ ..... ఇద్దరూ మొహమొహాలు చూసుకున్నారు. విహారి కారులోంచి జేబురుమాలు బయటపెట్టి గాలివాటం చూశాడు.

"వాళ్ళు ఫోన్ చెసింది సరీగ్గా బెంగుళూరు విమానం దిగే టైము. వెళ్ళేటప్పుడు ఎలా వెళ్ళినా, దిగేటప్పుడు తప్పనిసరిగా వీస్తున్న గాలికి ఎదురుగా దిగాలి. బ్రేకుల వత్తిడి ఒక్కటే సరిపోదు. గాలి తూర్పునుంచి పడమరకు వీస్తూంది. అంటే విమానం పడమరనుంచి తూర్పుకి దిగివుంటుంది కాబట్టి వాళ్ళు పిల్లల్ని దాచిన స్థలం విమానాశ్రయానికి పడమర వైపు వుండి వుండడానికి ఎక్కువ ఛాన్స్ వుంది. రన్‌వేకి అత్యంత సమీపంలో."

చేసుకుని దానిమీద చర్చించగలిగే ఆఫీసర్లు చాలా తక్కువమంది వుంటారు. అతడు చెప్పింది అక్షరాలా నిజంకాక పోవచ్చు. కానీ లాజిక్ .....

"అటు వెళ్ళి చూద్దామా? గాలిలో బాణం వేద్దాం. తగుల్తే తగుల్తుంది."

అతడు తలూపాడు.

కారు విమానాశ్రయంవేపు వెళ్ళింది.

రన్‌వేకి పడమటివైపు చిన్న చిన్న పాకలు, ఆక్రమిత స్థలాలూ వున్నాయి.

"టెర్రరిస్టులు ఇక్కడ ఏదో ఒక షాపునుంచి చేసి వుంటాడు. చిన్నపిల్లల్ని అంతమందిని నడిపిస్తూ తీసుకు వెళ్ళలేరు కాబట్టి, వ్యాన్ తాలూకు టైరుగుర్తులు వుండి వుంటాయి. పిల్లల్ని దింపేశాక వ్యాన్‌ని దూరంగా వదిలేసి వుంటారు. ఆ టైరు గుర్తులు పట్టుకోవటం కష్టం కాదనుకుంటాను."

ప్రవల్లిక నవ్వింది. "మీరు పోలీసు డిపార్టుమెంట్‌లో చేరాల్సింది."

విహారి సిరియస్‌గా అన్నాడు, "డిటెక్టివ్ నవల్స్ చిన్నప్పుడు చదివేవాడిని---"

కారు విమానాశ్రయానికి అటువైపు రన్‌వేకి సమాంతరంగా వెళుతూంది. దూరంగా గుట్టమీద పాడుపడిన భవంతి కనిపిస్తోంది. పై కప్పులేదు. మొండి గోడలున్నాయి. చుట్టూ చెట్లు దట్టంగా అల్లుకుని, ఆ చీకట్లో భయంకరంగా వున్నాయి.

"మన అంచనా ఏమాత్రం కరెక్టయినా ఆ బిల్డింగే మన టార్గెట్ ..... " విహారి పూర్తిచేశాడు.

ఇద్దరూ చాలా సేపు ఆ బిల్డింగ్ వంకే చూస్తూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"చాలా డెలికేట్ వ్యవహారం. లోపల టెర్రరిస్టులు ఎంతమంది వున్నారో చూడాలి ఒక్కసారిగా అందర్నీ బంధించకపోతే పసిపిల్లల ప్రాణాలకే ప్రమాదం."

కారు అక్కడే ఆపుచేసి, వాళ్ళు దాదాపు రెండు ఫర్లాంగులు నడిచి, గుట్ట దగ్గిరకి చేరుకున్నారు. అక్కణ్నుంచి కూడ బిల్డింగ్‌ని చెట్లు కవర్ చేస్తున్నాయి.

"ఇన్ని గంటలపాటు పగలు, రాత్రి, ఎండలో, చలిలో ఇలా పిల్లల్ని పైకప్పు లేకుండా వుంచారంటే, వాళ్ళు మనుషులు కాదు - రాక్షసులు" అన్నదామె.

"చాలా కొద్దిసేపట్లో ఇంతకు ఇంతా అనుభవించబోతున్నారు వాళ్ళూ" విహారి ముందుకు సాగుతూ అన్నాడు. అతడి కళ్ళముందు వినీల్ శవం కనబడుతోంది. రక్తంలో తడిసి, గువ్వలా ముడుచుకు పడివున్న శరీరం .....

బిల్డింగ్ వెనుకవైపు చేరుకున్నాడు. మిలటరీలో ఆమె వేళ్ళు ఒక చేతిలోకి మరొకటి జొనిపి పట్టుకుంటే అతడు వాటిమధ్య కాలుపెట్టి పైకి ఎక్కి ..... గోడ అంచు ఆధారంగా లోపలికి చూసేడు.

లోపల దృశ్యం హృదయవిదారకంగా వుంది.

పిల్లలు ఏడవటానికి కూడ ఓపికలేనట్టు పడివున్నారు. ముగ్గురు టెర్రరిస్టులున్నారు.

తూంది. ఒకడు గుమ్మం దగ్గిర నిల్చుని బయటకు చూస్తున్నాడు. ఒకడు బ్రెడ్ తింటూ బొగ్గుతో ఒక స్త్రీ నగ్నంగా వున్న బొమ్మ గోడమీద గీస్తున్నాడు. ఇంకొకడు అటూ ఇటూ పచార్లు చేసున్నాడు. ముగ్గురి మొహాలకీ (పిల్లలు తరువాత తమని గుర్తుపట్టటానికి వీల్లేకుండా) మాస్క్‌లున్నాయి.

దాదాపు పిల్లలందరూ స్పృహతప్పి పడి వున్నారు కొందరు జ్వరంతో మూలుగుతున్నారు. కొందరు చలికి ముణగ దీసుకు పడివున్నారు. ఎవరో కుర్రవాడు నిద్రలోనే ‘అమ్మా - అమ్మా’ అంటూ ఏడుస్తున్నాడు.

చిక్కేమిటంటే, వారిద్దరి దగ్గిరా కలిపి ఒకటే రివాల్వర్ వుంది. ముగ్గురు ఉగ్రవాదుల్నీ ఒక పిస్టల్‌తో ఎదుర్కోవటం అంత తెలివి తక్కువ పని మరొకటి లేదు. ప్రత్యర్థుల దగ్గిర మిషన్‌గన్స్ వున్నాయి. పిల్లల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి.

ఇద్దరూ ఆ బిల్డింగ్‌కి దూరంగా వచ్చారు.

“లోపల ముగ్గురు టెర్రరిస్టులు కనబడుతున్నారు. గోడకి అటు వైపు ఇంకా ఎందరున్నారో తెలీదు, మనం పోలీసులని రప్పిద్దామా” అడిగాడు విహారి.

“ఈ పిల్లలు ఈ రాత్రి ఈ వర్షంలో అంత సేపు వుండగలరనుకోను. ఇప్పటికే సగంమంది ఫెయింట్ అయివున్నారు” అన్నాడు తను చూసిన దృశ్యం సగం మంది ఫెయింట్ అయివున్నారు ” అన్నాడు తను చూసిన దృశ్యం గుర్తుకు తెచ్చుకుంటూ. ఇద్దరూ కొంతసేపు మౌనంగా వున్నారు.

“ప్రవల్లిక” “నాకో అయిడియా వచ్చింది” అంటూ చెప్పింది అంతా విని, “గుడ్” అన్నాడు విహారి. ఇద్దరూ కారు దగ్గిరకి వెళ్ళారు. ఆమె కారులోంచి వైర్‌లెస్‌తో తన ఆఫీసుకి మాట్లాడింది.

ఢిల్లీనుంచి అప్పుడే అత్యవసరంగా పిలిపించబడిన చీఫ్ - ఆ కాల్ అందుకున్నాడు.

“నేను సర్! డిప్యూటీ మాట్లాడుతున్నాను. టెర్రరిస్టుల స్థావరం దొరికింది.-”

చీఫ్ ఎగ్జయిట్ అయ్యాడు. అతడి కంఠంలో రిలీఫ్ కనపడింది.

“ఎక్కడ?” అని అడిగాడు. ఆమె వివరాలు చెప్పి, “ఇందులో ఒక ప్రమాదం వుంది సర్. మనం ఏమాత్రం ఫోర్స్ ఉపయోగించినా. వాళ్ళు ఎటు తోచని పరిస్థితుల్లో పిల్లల ప్రాణాలు తీయొచ్చు.”

“మరేం చేద్దాం” చీఫ్ సిన్సియర్‌గా అడిగాడు. అతడే దేశద్రోహి కాదు. డ్యూటీకన్నా భక్తి ఎక్కువ అంతే. వయసు పెరిగేకొద్దీ ఆ భర్తి మూర్ఖత్వంగా మారుతున్న స్టేజీలో వున్నాడే తప్ప - చిన్న పిల్లల విషయమై అతడూ ఆందోళన చెందుతున్నాడు.

“నాకో ఆలోచన వచ్చింది సర్. లోపల ఎంతమంది వున్నారో తెలియటంలేదు. పుట్టలోంచి బయటకు వచ్చేలా చెయ్యాలి వాళ్ళని?”

“ఏం చేద్దామని నీ ఆలోచన మిస్ ప్రవల్లికా?”

"ఆర్టిఫీషియల్ రెయిన్ సృష్టించాలి సర్."

"చీఫ్‌కి తను వింటున్నది అర్థంకాలేదు "ఏమిటి?" అన్నారు. సంధిగ్దంగా.

"మూడు ఫైరింజెన్లు, రెండు ఎలక్ట్రానిక్ స్పీకర్లు, ఒక ఆర్కు బ్రూట్‌తో పై కప్పులేదు టెర్రరిస్టులు పిల్లల్ని మరోచోటుకి తీసుకుని వెళ్ళే ప్రయత్నం ఏదీ చెయ్యరని నేను అనుకుంటున్నాను. ఇక్కడే ఏ చెట్టు కిందో తాత్కాలికంగా తలదాచుకుని వర్షం తగ్గేక పిల్లల్ని భవంతిలోకే తీసుకు వెళతారు. బాగా చీకటి వుంది ఇక్కడ. చెట్లు కూడ చాలా వున్నాయి. ప్రతి చెట్టు దగ్గిర మన వాళ్ళని నలుగురి చొప్పున వుంచితే. అకస్మాత్తుగా దాడి జరపవచ్చు. ఒక్కసారిగా ఫ్లాష్‌లైట్లు వేసి, ఆ కంగారునుంచి వాళ్ళు తేరుకునే లోపులో ఓ వార్ పవర్ చెయ్యాలి వాళ్ళని.

"గుడ్ ..... " అన్నాడు. "చీఫ్ ..... నువ్వు కారు దగ్గిరే వుండు. సరీగ్గా అరగంటలో నేను అన్ని ఏర్పాట్లతో వస్తాను."

"సర్ ..... "ఆమె సందేహించింది.

"ఏమిటి?"

"ఇదంతా ఎంతో నిశ్శబ్దంగా -మూడో కంటికి తెలియకుండా జరగాలి."

చీఫ్ సంవత్సరాలు పైగా అనుభవం వుండి నువ్వేం కంగారు పడకు. ఆ స్థావరాన్ని కనుక్కున్నందుకు నీకు మరో మెడల్ రికమెండ్ చేయ బోతున్నాను" వైర్‌లెస్ ఆఫ్ చేసి, ఫోన్ అందుకున్నాడు ఛీఫ్. ముందు ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు. తరువాత ఆర్కుబ్రూట్, ఎలక్ట్రానిక్ అంప్లిఫయర్స్ వచ్చాయి, పది నిముషాల్లో యాభైమంది ఆఫీసర్లు పూర్తి నల్ల డ్రస్సుల్లో తయారై బయల్దేరారు. పది కార్లు ఆ చీకట్లో నిశ్శబ్దంగా నిమానాశ్రయంవైపు బయల్దేరాయి.

చీఫ్ చేతికి వున్న తాయెత్తు ద్వారా మొత్తం సంభాషణంతా అనంతానంతస్వామిని చేరిందన్న సంగతి వారికి తెలీదు.

* * * *

ఆ గదిలో అనంతానంతస్వామి నిశ్శబ్దంగా కూర్చుని వున్నాడు.

మిస్ ప్రవల్లిక .....

విత్తనం అనుకున్నది మొక్క అయింది. ముళ్ళపొద కాకముందే తొలగించాలి. కానీ అది తరువాత సంగతి.

ముందు తన మనుషులు ముగ్గుర్నీ రక్షించుకోవాలి.

అతడు లేచి పచార్లు చేయటం ప్రారంభించాడు. విసుగ్గా గడియారం వంక చూస్తూండగా పరమేశ్వరం వచ్చాడు.

"రా. నీ కోసమే చూస్తున్నాను. చిన్న సమస్య వచ్చి పడింది" అంటూ జరిగిందంతా చెప్పి, "మనవాళ్ళని బ్లాక్ కమెండోస్ వలయంలా చుట్టుముట్టారు. వాళ్ళకి ప్రమాద సూచన పంపించాలి. ఎలాగో అర్థం కావటంలేదు. మనం కూడా బయటపడకూడదు. మన వాళ్ళని

రక్షించుకోవాలి ..... ఎలా?"

పరమేశ్వరం కళ్ళు మూసుకున్నాడు. ప్రధానమంత్రిని నలుగురి మధ్యా చంపిన హంతకుడిని నేరం నుంచి ఎలా తప్పించాలా అని అలోచించే లాయర్‌లా ఆలోచించాడు. రెండు క్షణాల తరువాత కళ్ళు తెరిచి, "ఆ పిల్లల తల్లిదండ్రులు ఎక్కడున్నారు?" అని అడిగాడు.

"ఆ కంట్రోల్ రూమ్ దగ్గిరే."

"పిల్లల్ని టెర్రరిస్టులు ఎక్కడ దాచారో పోలీసులకి తెలిసి పోయింది. ఫలానా చోటుకి వెళ్ళారు -" అన్న వార్తని ఆ తల్లిదండ్రులకి తెలియజేస్తే చాలు" పూర్తిచేశాడు పరమేశ్వరం.

ఒక అద్భుతాన్ని చూసినట్టు అతడిని చూశాడు స్వామి. ఇటువంటి 'తెలివి' తనకి ఒక స్తంభంలా ఆసరా ఇస్తూ వుండటం అతడికి సంతోషంగా వుంది.

ఈ లోపులో పరమేశ్వరం వివరించాడు. "మనవాళ్ళు దయాదాక్షిణ్యం లేని కర్కోటకులు. వర్షంలో పిల్లలు తడిసినా పెద్దగా పట్టించుకోరు. తాము మాత్రం బయటకొచ్చి చెట్లక్రింద నిలబడి ఆ భవంతిని గార్డు చేస్తాడే తప్ప, పిల్లల్ని బయటకు తీసుకురారు ఏ ఒక్క పిల్లవాడు ఆ చీకట్లో తప్పించుకున్నా తల్లిదండ్రులు రకరకాల వాహనాల మీద అక్కడికి చేరుకుంటారు. వాళ్ళని ఆపగలిగే ధైర్యంగాని, సామర్థ్యంగాని పోలీసులకి వుండదు. వాళ్ళ ఆతృత వాళ్ళది. అదే మనని రక్షిస్తుంది. మన వాళ్ళకి రాబోయే అపాయాన్ని సూచిస్తుంది ..... "

స్వామి రిలాక్సింగ్‌గా నవ్వేడు. అయిదు నిమిషాల క్రితం వున్న టెన్షన్ ఇప్పుడు లేదు. చేయి సాచి "థాంక్స్" అన్నాడు. "ఇటువంటి ఆలోచన కోసమే నిన్ను పిలిపించింది."

పరమేశ్వరం షేక్‌హాండ్ ఇవ్వబోయాడు.

స్వామి చప్పున చేయి వెనక్కి తీసుకున్నాడు. దృతరాష్ట్రుడు ఎవర్ని కౌగిలించుకున్నా ఆ ఉక్కు పిడికిలిలో వాళ్ళు నలిగి, పొడి అయినట్టే పరమేశ్వరం ఎవరికి షేక్‌హాండిస్తే వాళ్ళు మాడి అయిపోవాల్సిందే!! అటువంటి విషపు చెయ్యి అతడిది!!! ఆ విషయం పరమేశ్వరానికి కూడా తెలుసు. స్వామిలాటివాడే తటపటాయించటం చూచి, నవ్వుతూ చెయ్యి వెనక్కి తీసుకుని "వెళ్ళొస్తాను" అన్నాడు.

*   *   *   *

"మీ రివాల్వర్ నాకివ్వండి" అన్నాడు విహారి, ప్రవల్లిక అతడి వైపు విస్మయంగా చూసింది. ఇద్దరూ రోడ్‌మీద నిలబడి, రాబోయే వాహనాల కోసం చూస్తున్నారు. అతడు ఆమెని అలా అడిగేసరికి, అర్థంకాలేదు. "ఎందుకు" అని అడిగింది.

"నేను ఆ భవంతి దగ్గిరే..... వీలయితే లోపలే వుందామను కుంటున్నాను..... మీరీ కృత్రిమ వర్షం తాలూకు ప్రయోగాలు చేస్తున్నప్పుడు....

"దేనికి?" అడిగింది ఆశ్చర్యంగా.